పారిస్ పారాలింపిక్స్ ప్రారంభ వేడుకలు రాత్రి 11.30 నుంచి స్పోర్ట్స్-18లో



## మన దీప్తి మెరువాలి..

నమస్తే తెలంగాణ క్రీడావిభాగం




ప్రతిష్ఠాత్మక పారిస్ పారాలింపిక్స్‌లో మన తెలంగాణ నుంచి యువ అథ్లెట్ జివాంజీ దీప్తి పోటీకి దిగుతున్నది. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామానికి చెందిన దీప్తి..అంతర్జాతీయ స్థాయిలో దేశ ఖ్యాతిని దశ దిశలా ఇనుమడింపజేస్తున్నది. ప్రతిభకు వైకల్యం అడ్డుకాదని నిరూపిస్తూ విశ్వవేదికపై త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించేందుకు సిద్ధమైంది. ద్రోణాచార్య అవార్డు గ్రహీత, ప్రస్తుత జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ కోచ్ నాగపురి రమేశ్ శిక్షణలో రాటుదేలిన దీప్తి..అంచలంచెలుగా ఒలింపిక్స్ స్థాయికి ఎదిగింది. కెరీర్ తొలి నాళ్లలో సాధారణ అథ్లెట్లతో పోటీపడ్డ దీప్తి..ఆ తర్వాత పారా అథ్లెటిక్స్ వైపు కెరీర్ మలుచుకుంది. మేధోపరమైన సమస్యలతో బాధపడుతున్న దీప్తి..పారా అథ్లెటిక్స్‌లో పతకాల పంట పండిస్తున్నది. పారిస్ పారాలింపిక్స్‌లో మహిళల టీ20 400మీటర్ల విభాగంలో బరిలోకి దిగుతున్న దీప్తి..పసిడి కాంతులు విరజిమ్మాలని చూస్తున్నది. గత మే నెలలో కోబ్(జపాన్)లో జరిగిన ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 55.07సెకన్ల టైమింగ్‌తో వరల్డ్ రికార్డు తన పేరిట లిఖించుకుంది. తద్వారా ప్రపంచ పారా టోర్నీలో స్వర్ణం గెలిచిన తొలి భారత అథ్లెట్‌గా దీప్తి రికార్డుల్లోకెక్కింది. సరైన ఆర్థిక మద్దతు లేక కెరీర్ మొదట్లో ఇబ్బందులు ఎదుర్కొన్న దీప్తి ప్రస్తుతం స్పాన్సర్ల దృష్టిని ఆకర్షించింది. బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ గోపీచంద్ ఆర్థిక సహకారంతో అంతర్జాతీయ టోర్నీల్లో ప్రాతినిధ్యం వహిస్తున్నది.

# పారా హుషార్

నేటి నుంచి పారిస్ పారాలింపిక్స్ ● భారీ బృందంతో బరిలో భారత్ ● 25 పతకాలే లక్ష్యంగా పోటీలోకి



పారిస్: పారిస్ పారాలింపిక్స్‌కు మరికొన్ని గంటల్లో అట్టహాసంగా తెరలేవనుంది. సుదీర్ఘ ఒలింపిక్స్ చరిత్రలో కనివినీ ఎరుగని రీతిలో చారిత్రక సీన్‌నదిపై ఆరంభ వేడుకలతో ప్రపంచదృష్టిని ఆకర్షించిన పారిస్..మరోమారు అలరించేందుకు ముస్తాబవుతున్నది. తమ చారిత్రక వారసత్వాన్ని, వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేసేందుకు ఫ్రాన్స్ విభిన్న కళారీతులతో కనువిందు చేయనుంది. పన్నెండు రోజుల పాటు సాగనున్న మెగాటోర్నీలో మొత్తం 4,400 మంది పారా అథ్లెట్లు 22 క్రీడాంశాల్లో 549 పతకాల కోసం పోటీపడనున్నారు. ఇక భారత్ విషయానికొస్తే..ఈసారి 84 మందితో 12 విభాగాల్లో పతకాల వేట కొనసాగించనుంది. టోక్యో పారాలింపిక్స్(2020)లో ఐదు స్వర్ణాలు సహా 19 పతకాలు సాధించిన మన అథ్లెట్లు ఈసారి మరింత మెరుగైన ప్రదర్శన కనబర్చాలని చూస్తున్నారు.

**సుమిత్, అవనిపై భారీ ఆశలు:**

పారిస్ పారాలింపిక్స్‌లో స్టార్ అథ్లెట్లు సుమిత్ అంటిల్, అవని లేఖరపై భారీ ఆశలు ఉన్నాయి. గత టోక్యో ఒలింపిక్స్‌లో పసిడి పతకాలతో మెరిసిన ఈ ఇద్దరు ఈసారి కూడా అదే ప్రదర్శన కనబర్చాలన్న పట్టుదలతో ఉన్నారు. 17 ఏండ్ల వయసులో ప్రమాదంలో ఎడమ కాలు కోల్పోయిన అంటిల్ జావెలిన్‌త్రోలో అద్భుత ప్రదర్శనతో అదరగొడుతున్నాడు. గత మేలో జరిగిన పారా ప్రపంచ చాంపియన్‌షిప్‌లో సుమిత్ పసిడి పతకంతో మెరిశాడు. పారిస్ పారాలింపిక్స్‌లో 75మీటర్ల మార్క్ లక్ష్యంతో అంటిల్ పోటీకి దిగుతున్నాడు. ఇప్పటికే అంతర్జాతీయ టోర్నీల్లో లెక్కకు మిక్కిలి పతకాలు సాధించిన సుమిత్..ఈ సారి పసిడి పతకంతో కొత్త చరిత్ర లిఖించాలని చూస్తున్నాడు. మరోవైపు మహిళల షూటింగ్ 10మీటర్ల ఎయిర్ రైఫిల్‌తో పాటు 50మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్‌లో అవని తన అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. టోక్యోలో స్వర్ణంతో సహా కాంస్యం దక్కించుకున్న అవని..ఈసారి మరో రెండు పతకాల ద్వారా అరుదైన ఘనత సాధించాలని చూస్తున్నది.

**వీరిపై నజర్:**

పారిస్ పారాలింపిక్స్‌లో ఈసారి కచ్చితంగా పతకం సాధిస్తారన్న వారిలో తెలంగాణ యువ అథ్లెట్ జివాంజీ దీప్తి(టీ20 400మీ), మరియప్పన్ తంగవేలు(టీ63-హైజంప్), యోగేశ్ కథునియా(ఎఫ్56, డిస్కస్‌త్రో), శీతల్‌దేవి(ఆర్చరీ-కాంపౌండ్), కృష్ణనాగర్(ఎస్‌హెచ్6),సుహాస్ యతిరాజ్(బ్యాడ్మింటన్), భవీనాబెన్ పటేల్(టీటీ) ముందున్నారు.

**పతాకధారులుగా సుమిత్, భాగ్యశ్రీ:**

పారిస్ పారాలింపిక్స్ ఆరంభ వేడుకల్లో సుమిత్ అంటిల్, భాగ్యశ్రీ జాదవ్ జాతీయ పతాకధారులుగా వ్యవహరించనున్నారు. పారాలింపిక్స్ గేమ్స్ చరిత్రలో తొలిసారి స్టేడియం బయట జరిగే ప్రారంభ కార్యక్రమంలో వీరు జాతీయజెండా చేతబూని ముందుకు సాగనున్నారు.



## మన మహిళా సైన్యమిదే

టీ20 ప్రపంచకప్ కోసం భారత జట్టు ప్రకటన.. హర్మన్‌ప్రీత్‌కౌర్ సారథ్యంలో బరిలోకి

న్యూఢిల్లీ: ఈ ఏడాది అక్టోబర్‌లో యూఏఈ వేదికగా జరగాల్సి ఉన్న ప్రతిష్టాత్మక మహిళల టీ20 ప్రపంచకప్ కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) భారత జట్టును ప్రకటించింది. 15 మంది సభ్యులతో కూడిన టీమ్‌ఇండియాకు హర్మన్‌ప్రీత్‌కౌర్ సారథ్యం వహించనుండగా స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనుంది. ఇటీవల ముగిసిన మహిళల ఆసియా కప్‌లో ఆడిన జట్టులో వికెట్ కీపర్ ఉమా ఛెత్రి మినహా మిగిలిన వారంతా ప్రపంచకప్ జట్టులో చోటు దక్కించుకున్నారు. స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్, షఫాలీ వర్మ, హర్మన్‌ప్రీత్ కౌర్, రిచా ఘోష్, దయాలన్ హేమలత బ్యాటింగ్ బాధ్యతలు మోయనున్నారు. పేసర్లుగా రేణుకా సింగ్, పూజా వస్త్రకార్, అరుంధతిరెడ్డి ఉండగా దీప్తి శర్మ, ఆశా శోభన, రాధా యాదవ్, సజనా సజీవన్ వంటి స్పిన్నర్లతో జట్టు పటిష్టంగా ఉంది.

**భారత జట్టు:** హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన, షఫాలీ వర్మ, దీప్తి శర్మ, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), యస్తికా భాటియా, పూజా వస్త్రకార్, అరుంధతి రెడ్డి, రేణుకా సింగ్ ఠాకూర్, దయాలన్ హేమలత, ఆశా శోభన, రాధా యాదవ్, శ్రేయాంక పాటిల్, సజన సజీవన్

**ట్రావెలింగ్ రిజర్వ్:** ఉమా ఛెత్రి, తనూజా కన్వర్, సైమా ఠాకూర్

## ఐసీసీ చైర్మన్‌గా జై షా


ఎన్నిక ఏకగ్రీవం.. అతి పిన్న వయసులో చైర్మన్‌గా రికార్డు



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నూతన చైర్మన్‌గా భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సెక్రటరీ జై షా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఈ మేరకు మంగళవారం ఐసీసీ ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. ప్రస్తుతం ఐసీసీ చైర్మెన్‌గా ఉన్న గ్రెగ్ బార్క్‌లే పదవీకాలం త్వరలో ముగియనుండటంతో ఆయన స్థానాన్ని షా భర్తీ చేయనున్నాడు. తద్వారా 35 ఏండ్ల వయసులోనే ఐసీసీ చైర్మన్‌గా ఎన్నికైన అతి పిన్న వయస్కుడిగా నిలిచాడు. డిసెంబర్ 1 నుంచి జై షా ఐసీసీ చైర్మన్ బాధ్యతలు స్వీకరించనున్నాడు. భారత్ నుంచి ఈ ఘనత దక్కించుకున్న ఐదో వ్యక్తి షా. గతంలో జగ్‌మోహన్ దాల్మియా, శరద్ పవార్, ఎన్.శ్రీనివాసన్, శశాంక్ మనోహర్ ఐసీసీ చైర్మన్లుగా పనిచేశారు. ఐసీసీ చైర్మన్‌గా ఎన్నికవడం తనకు దక్కిన గొప్ప గౌరవమని షా తెలిపాడు.

ఐసీసీలో 17 ఓట్లు (12 టెస్టు ఆడే సభ్య దేశాలు, చైర్మన్, డిప్యూటీ చైర్మన్, ఇద్దరు అసోసియేట్ మెంబర్ నామినీలు, ఒక మహిళా డైరెక్టర్) ఉండగా జై షా ఎన్నికకు 15 మంది మద్దతు తెలపడంతో అతడి ఎన్నిక ఏకగ్రీవమైంది. ఐసీసీ నూతన చైర్మన్‌గా ఎన్నికైన జై షా కు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్ మోహన్ రావు శుభాకాంక్షలు తెలిపారు.

## 'హైదరాబాద్‌ను మిస్ అవుతున్నా' : వార్నర్




'చార్ సౌ సాల్ కా షహర్'గా పిలుచుకునే హైదరాబాద్ అంటే అభిమానం ఎవరికి ఉండదు. ఒక్కసారి ఈ నగరంతో కనెక్ట్ అయ్యామంటే జీవితాంతం ఆ జ్ఞాపకాలు వెంటాడుతూనే ఉంటాయి. హైదరాబాదీ ప్రజల ప్రేమాభిమానాలకు దాసోహమైన మాజీ క్రికెటర్ డేవిడ్ వార్నర్ సైతం భాగ్యనగరాన్ని చాలా మిస్ అవుతున్నానని తెలిపాడు. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు గతంలో సారథిగా వ్యవహరించిన అతడిని ఆరెంజ్ ఆర్మీ ఫ్యాన్స్ 'వార్నర్ భాయ్' అని పిలుచుకుంటారు. ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్ వేదికగా అతడు.. హైదరాబాద్ ఐకాన్ అయిన చార్మినార్ ఫొటోను షేర్ చేస్తూ 'నాకు అత్యంత ఇష్టమైన ప్రదేశాన్ని మిస్ అవుతున్నా' అని రాసుకొచ్చాడు.

## జొకో, కొకో ముందంజ

తొలి రౌండ్‌లో నెగ్గిన స్టార్ ప్లేయర్లు

2020 చాంపియన్ డొమినిక్‌కు షాక్



న్యూయార్క్: ప్రతిష్టాత్మక యూఎస్ ఓపెన్‌లో డిఫెండింగ్ చాంపియన్లుగా బరిలోకి దిగిన నొవాక్ జొకోవిచ్ (సెర్బియా), కొకో గాఫ్ (అమెరికా) ముందంజ వేశారు. తన కెరీర్‌లో 25వ గ్రాండ్‌స్లామ్ వేటలో ఉన్న జొకో.. మంగళవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లలో భాగంగా పురుషుల సింగిల్స్‌లో 6-2 6-2, 6-4తో రాడు అల్బోట్ (మాల్డోవా)ను వరుస సెట్లలో చిత్తు చేశాడు. ఈ టోర్నీలో జొకోకు ఇది 89వ విజయం కావడం విశేషం. తద్వారా అతడు రోజర్ ఫెదరర్ విజయాల రికార్డు(89)ను సమం చేశాడు. రెండో రౌండ్‌లో అతడు సెర్బియాకే చెందిన లస్లో జెరెతో తలపడనున్నాడు. మిగిలిన మ్యాచ్‌లలో అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ), కాస్పర్ రూడ్ (బ్రిటన్), టేలర్ ఫ్రిట్జ్ తొలి రౌండ్ విఘ్నాన్ని విజయవంతంగా దాటారు. అయితే 2020 యూఎస్ ఓపెన్ చాంపియన్ అయిన డొమినిక్ థీమ్ (ఆస్ట్రేలియా) 4-6, 2-6, 2-6తో బెన్ షెల్టన్ (అమెరికా) చేతిలో ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించాడు. భారత స్టార్ టెన్నిస్ ప్లేయర్ సుమిత్ నాగల్ పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది. మహిళల సింగిల్స్‌లో అమెరికా యువ సంచలనం కొకో గాఫ్ 6-2, 6-0తో వర్వర గ్రచెవ (ఫ్రాన్స్)ను ఓడించింది. ఇటీవలి కాలంలో అంతగా ఫామ్‌లో లేని గాఫ్ యూఎస్ ఓపెన్‌లో మాత్రం దూకుడు ప్రదర్శించింది. రెండో సీడ్ అరీనా సబలెంక (బెలారస్) 6-3, 6-3తో ప్రిసిల్లా (ఆస్ట్రేలియా)ను ఓడించి తర్వాతి రౌండ్‌కు దూసుకెళ్లింది. క్రెజికోవా (చెక్ రిపబ్లిక్), అజరెంక (బెలారస్) సైతం రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు.

## యూ ముంబాపై అహ్మదాబాద్ విజయం

చెన్నై: అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ (యూటీటీ)లో అహ్మదాబాద్ ఎస్‌జీ పైపర్స్ జోరు కొనసాగిస్తోంది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో అహ్మదాబాద్ 9-6తో యూ ముంబాను ఓడించింది. పురుషుల సింగిల్స్‌లో ముంబా ప్యాడ్లర్ మానవ్ ఠక్కర్ చేతిలో మనుష్ షా ఓడగా ఖ్వాద్రి అరుణ.. లిలియన్ బార్డెట్‌ను మట్టికరిపించాడు. కానీ మహిళల సింగిల్స్‌లో అహ్మదాబాద్ ప్లేయర్ రీత్ రిష్య.. సుతిర్థను చిత్తు చేయగా బెర్నడెట్టె మరియ జియావొను ఓడించింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో అహ్మదాబాద్ ద్వయం మనుష్-జాక్స్ చేతిలో మావన్-జియావొ జోడీ పరాభవం పాలవడంతో ముంబాకు పరాభవం తప్పలేదు.






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.